సాక్షి విశాఖపట్నం

బుధవారం । 14 । మే । 2025



ఆహా.. ఆవకాయ 8లో



విపత్తు వేళ ఎలా స్పందించాలంటే.. 8లో



థియేటర్లలో నవ్వులే నవ్వులు 8లో

న్యూస్‌రీల్

చందనం విక్రయాల ప్రారంభం



చందనం ప్యాకెట్లు అందిస్తున్న ఏఈవో ఆనంద్‌కుమార్

సింహాచలం: చందనోత్సవం నాడు శ్రీ **వరాహ** లక్ష్మీనృసింహస్వామిపై నుంచి ఒలిచిన నిర్మాల్య చందన విక్రయాలను మంగళవారం నుంచి ప్రారంభించారు. ఉచిత దర్శనం క్యూలో 400 మందికి, రూ.100 క్యూలో 300 మందికి, రూ. 300 క్యూలో 300 మందికి ఒక్కో ప్యాకెట్ రూ.10 చొప్పున విక్రయించారు. దేవస్థానం ఏఈవో ఎస్.ఆనంద్‌కుమార్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

11 మంది కార్మిక నాయకులకు షోకాజ్ నోటీసులు

సాక్షి, విశాఖపట్నం : స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం 11 మంది కార్మిక నాయకులకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఈ నెల 20న దేశవ్యాప్త సమ్మె నేపథ్యంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు మంగళవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో బ్లాస్ట్‌ఫర్నేస్–1 విభాగంలో సమ్మె ప్రచారం నిర్వహించారు. దీనిపై ఆగ్రహించిన యాజమాన్యం కంపెనీ నిబంధనలకు వ్యతిరేకంగా పనిప్రదేశం వదిలి వెళ్లడాన్ని తప్పు పడుతూ 11 మంది కార్మిక నాయకులకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. మరి కొందరికి బుధవారం నోటీసులు జారీ చేయనున్నట్టు సమాచారం. కార్మిక నాయకులకు షోకాజ్ నోటీసు జారీ చేయడం పట్ల కార్మిక సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. యాజమాన్యం వైఖరికి నిరసనగా బుధవారం ఉదయం ఉక్కు అడ్మిన్ భవనం కూడలి వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు కార్మిక నాయకులు ప్రకటించారు.

ఎంఐజీ అపార్ట్‌మెంట్లపై.. పచ్చ గెద్దలు!



మధ్య తరగతి కోసం బహుళ అంతస్తుల నిర్మాణాలకు వీఎంఆర్‌డీఏ ప్రణాళికలు

మధురవాడ, వేపగుంట ప్రాంతాల్లో 5 నుంచి 7 ఎకరాల్లో ఫ్లాట్ల నిర్మాణాలు

ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతున్న అధికారులు

ఈ ప్రాజెక్టులను సొంతంగా చేపట్టాలన్న ఆలోచనలో అధికారులు

పీపీపీ పేరుతో కొట్టేసేందుకు టీడీపీ నేతల ప్రయత్నాలు

వారంలో తుది నిర్ణయం తీసుకునే అవకాశం

విశాఖ సిటీ : విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ(వీఎంఆర్‌డీఏ)పై 'పచ్చ' కళ్లు పడ్డాయి. సంస్థ చేపట్టే ప్రాజెక్టులను పీపీపీ పేరుతో గెద్దల్లా తన్నుకుపోవడానికి తెలుగు తమ్ముళ్లు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే వీఎంఆర్‌డీఏ షాపులు, కల్యాణ మండపాలు, ఖాళీ స్థలాలపై వాలిపోయిన నేతలు.. తాజాగా మధ్యతరగతి ప్రజల కోసం చేపడుతున్న ఎంఐజీ అపార్ట్‌మెంట్లపై కన్నేశారు. నగరంలో రెండు ప్రాంతాల్లో బహుళ అంతస్తుల నిర్మాణాలకు వీఎంఆర్‌డీఏ అధికారులు శ్రీకారం చుట్టగా.. ఆ ప్రాజెక్టులను కొట్టేసేందుకు టీడీపీ నేతలు పావులు కదుపుతున్నారు. ప్రభుత్వ పెద్దల నుంచే తతంగాన్ని నడిపించేందుకు సిద్ధమవుతున్నారు.

ఫ్లాట్లకు డిమాండ్ తగ్గడంతో అపార్ట్‌మెంట్లు

వీఎంఆర్‌డీఏ దశాబ్ది కాలం క్రితం బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపట్టింది. ఆ తరువాత నుంచి అధికారులు కేవలం లేఅవుట్ల అభివృద్ధిపైనే దృష్టి సారించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత విశాఖలో స్థిరాస్తి రంగం కుదేలైంది. ప్లాట్ల క్రయ, విక్రయాలు మందగించాయి. ఈ ప్రభావం వీఎంఆర్‌డీఏకు చెందిన మిగులు ప్లాట్ల వేలంపై కూడా పడింది. వరుసగా ఆయా ప్లాట్లకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నప్పటికీ అవి అమ్ముడవం లేదు. దీంతో ఆర్థిక వనరులను సమకూర్చుకోవడానికి అధికారులు కొత్త ఆలోచన చేస్తున్నారు. ఎంఐజీ స్థలాల మాదిరిగానే ఎంఐజీ అపార్ట్‌మెంట్ల నిర్మాణాలు చేపట్టి విక్రయించాలని నిర్ణయించారు. నగరంలో ఎక్కడెక్కడ అపార్ట్‌మెంట్లకు డిమాండ్ ఉందన్న విషయాన్ని తెలుసుకోవడానికి ఇప్పటికే ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ డిమాండ్ సర్వేలో ప్రాజెక్టుల్లో కల్పించిన సౌకర్యాలతో పాటు ప్రజల ప్రాధాన్యతలను తెలుసుకోవడంపై దృష్టి పెట్టారు. వారి సలహాలు, సూచనలు, అభిరుచులకు తగ్గట్టుగా ఈ ప్రాజెక్టులను తీర్చిదిద్దాలని అధికారులు భావిస్తున్నారు.

మధురవాడ, వేపగుంటలలో..

ఇప్పటికే అధికారులు ఈ బహుళ అంతస్తుల నిర్మాణాలకు రెండు స్థలాలను ఎంపిక చేశారు. మధురవాడతో పాటు వేపగుంట ప్రాంతాల్లో ఉన్న వీఎంఆర్‌డీఏ స్థలాల్లో ఈ ప్రాజెక్టులను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. తొలి దశలో కేవలం 5 నుంచి 7 ఎకరాల్లో మాత్రమే అపార్ట్‌మెంట్లను నిర్మించాలని ఆలోచన చేస్తున్నారు. వీటికి వచ్చిన డిమాండ్‌కు అనుగుణంగా ఇతర ప్రాంతాల్లో కూడా ఈ తరహా నిర్మాణాలు చేపట్టాలని భావిస్తున్నారు. గతంలో మధురవాడ ప్రాంతంలో హరిత పేరుతో 11 బ్లాకుల్లో 100 హెచ్‌ఐజీ, 490 ఎంఐజీ, 120 ఎల్‌ఐజీ ఫ్లాట్లతో మొత్తంగా 710 యూనిట్లతో చేపట్టిన భారీ హౌసింగ్ ప్రాజెక్టు పూర్తికి దాదాపుగా దశాబ్ది కాలం పట్టింది. దీంతో కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ సారి అటువంటి పరిస్థితి తలెత్తకుండా భారీ స్థాయి ప్రాజెక్టు జోలికి వెళ్లడం లేదు. సెమీ గేటెడ్ కమ్యూనిటీ తరహాలో అన్ని హంగులతో ఎంఐజీ అపార్ట్‌మెంట్ ప్రాజెక్టును అందుబాటులోకి తీసుకురావాలన్న నిర్ణయంతో ఉన్నారు. మధ్యతరగతి ప్రజలకు సొంతింటి కలను సాకారం చేసేందుకు గాను బహిరంగ మార్కెట్‌లో కంటే చదరపు గజం ధర కాస్త తక్కువకే అందించడానికి కసరత్తు చేస్తున్నారు. పూర్తి స్థాయిలో ప్రాజెక్టు ప్లాన్ సిద్ధం చేసిన తరువాత తుది ధరను ప్రకటించనున్నారు.

పీపీపీ పేరుతో కాజేసే కుట్ర

ఒకవైపు సొంతంగానే ఈ ప్రాజెక్టును చేపట్టేందుకు అధికారులు సన్నాహాలు చేస్తుంటే.. టీడీపీ నేతలు మాత్రం ఈ ప్రాజెక్టులపై కన్నేసినట్లు తెలుస్తోంది. గతంలో రాజకీయ నాయకులు వీఎంఆర్‌డీఏకు చెందిన విలువైన ఖాళీ స్థలాలను లేఅవుట్ల అభివృద్ధి, విల్లాలు, అపార్ట్‌మెంట్ ప్రాజెక్టులు, కన్వెన్షన్ సెంటర్ల నిర్మాణాల కోసం తీసుకొని రూ.కోట్లకు కోట్లు వెనకేసుకున్నారు. సంస్థకు నామమాత్రంగా పడేసి చేతులు దులుపుకున్నారు. తాజాగా అదే తరహాలో ఈ ఎంఐజీ అపార్ట్‌మెంట్ల ప్రాజెక్టులను కూడా కైవసం చేసుకోవడానికి టీడీపీ నేతలు ఎత్తులు వేస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. పీపీపీ పేరుతో ఈ అపార్ట్‌మెంట్లను చేజిక్కించుకోవాలని చూస్తున్నట్లు సమాచారం. మరో వారం రోజుల్లో దీనిపై ఒక నిర్ణయం తీసుకునే అవకాశముంది.

మధ్యతరగతి వారి కోసం..



మధ్యతరగతి ప్రజల సొంతింటి కలను సాకారం చేసే లక్ష్యంతో ఎంఐజీ అపార్ట్‌మెంట్ ప్రాజెక్టుకు శ్రీకారం చుడుతున్నాం. ప్రస్తుతం నివాస ప్రాంతాలుగా మంచి డిమాండ్ ఉన్న మధురవాడ, వేపగుంటలో ఉన్న వీఎంఆర్‌డీఏ స్థలాల్లోనే ఈ అపార్ట్‌మెంట్లను నిర్మించాలని భావిస్తున్నాం. ఇందు కోసం ఇప్పటికే ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతున్నాం. ప్రజల సూచనలు, సలహాలతోపాటు వారి అభిరుచులకు తగ్గట్లుగా ప్రాజెక్టును అభివృద్ధి చేస్తాం. మార్కెట్ ధర కంటే తక్కువకే ఫ్లాట్లను అందించాలన్న సంకల్పంతో ఉన్నాం.

– కె.ఎస్.విశ్వనాథన్, మెట్రోపాలిటన్ కమిషనర్

స్టాఫ్ నర్సుల పోస్టుల్లో కోత

- 246 పోస్టుల భర్తీ నిలుపుదల
- అభ్యర్థుల్లో గందరగోళం

మహారాణిపేట: స్టాఫ్ నర్సుల నియామక ప్రక్రియలో చిత్రవిచిత్రాలు చోటుచేసుకుంటున్నాయి. ఆరు నెలలుగా కొనసాగుతున్న ఈ ప్రక్రియలో పోస్టుల సంఖ్యలో తరచూ మార్పులు చోటు చేసుకోవడంతో దరఖాస్తుదారులు అయోమయానికి గురవుతున్నారు. తొలుత ఉత్తరాంధ్ర జిల్లాల్లో 106 పోస్టుల కోసం దరఖాస్తులు స్వీకరించగా, ఆ తర్వాత మరో 264 పోస్టులు చేరాయి. మొత్తం 370 పోస్టుల భర్తీకి అధికారులు సిద్ధమయ్యారు. తాజాగా డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) ఆదేశాలతో 246 పోస్టుల భర్తీని నిలిపివేశారు. ప్రస్తుతం కేవలం 124 పోస్టుల భర్తీకి మాత్రమే ఎంపిక జాబితాను విడుదల చేయనున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ సంచాలకురాలు డాక్టర్ పి.రాధారాణి తెలిపారు. వైద్య విధాన పరిషత్, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఉండే ఆస్పత్రుల్లో పోస్టులను మాత్రమే భర్తీ చేయనున్నారు. వైద్య విధాన పరిషత్ పరిధిలో ఉండే కమ్యూనిటి హెల్త్ సెంటర్లు, ఇతర ఆస్పత్రుల్లో 90 పోస్టులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 34 పోస్టులు మాత్రమే భర్తీ చేస్తున్నామని ఆర్‌డీ వివరించారు. ఈ పరిణామం నిరుద్యోగుల్లో గందరగోళానికి దారితీసింది.

బెట్టింగ్ ప్రధాన నిందితుడు చందు అరెస్ట్

విశాఖ సిటీ: ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్ మోసాలకు పాల్పడుతున్న ప్రధాన నిందితుడు చందుని పోలీసులు చాకచక్యంగా అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బెట్టింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్న నిందితుడిని పోలీసులు ఇటీవల పట్టుకొని విచారించారు. అతడి నుంచి బెట్టింగ్ ప్రధాన నిందితుడి వివరాలను సేకరించారు. పరారీలో ఉన్న కాకినాడకు చెందిన ప్రధాన నిందితుడు సీహెచ్ వెంకటమణి చందుని అదే జిల్లాలో పట్టుకున్నారు. బెట్టింగ్ కోసం వినియోగిస్తున్న నాలుగు స్మార్ట్‌ఫోన్లు, ఒక కీప్యాడ్ మొబైల్‌ను నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్నారు. చందును అరెస్టు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో మరింత మంది బెట్టింగ్ రాయుళ్లతో పాటు బెట్టింగ్ ఆడుతున్న వారిపై పోలీసులు నిఘా పెట్టారు. వారి కోసం ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నారు.

భోగాపురం–రాంబిల్లి మధ్య సెమీ రింగ్ రోడ్

- 85 కిలోమీటర్ల మేర 4/6/8 వరుసల రహదారికి ప్రణాళికలు
- డీపీఆర్ తయారీ కన్సల్టెంట్ నియామకానికి వీఎంఆర్‌డీఏ చర్యలు
- ఆసక్తి వ్యక్తీకరణకు కన్సల్టెంట్ల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

విశాఖ సిటీ : భోగాపురం విమానాశ్రయానికి అనుసంధాన రహదారుల నిర్మాణాలపై వీఎంఆర్‌డీఏ దృష్టి పెట్టింది. నగరం నుంచే కాకుండా అనకాపల్లి నుంచి కూడా ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు కనెక్టివిటీకి చర్యలు చేపడుతోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతిపాదించిన ఏడు రహదారుల నిర్మాణాలకు టెండర్ల ప్రక్రియను ప్రారంభించింది. తాజాగా భోగాపురం–రాంబిల్లి మధ్య ప్రతిపాదిత సెమీ రింగ్ రోడ్డు (ఎస్‌ఆర్‌ఆర్) అభివృద్ధికి అడుగులు వేగంగా వేస్తోంది. సుమారు 85 కిలోమీటర్ల మేర నిర్మించే ఈ రహదారికి సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)ను సిద్ధం చేసే పనిలో నిమగ్నమైంది. ఇందు కోసం ప్రత్యేకంగా కన్సల్టెంట్ నియామకానికి ఆసక్తి వ్యక్తీకరణ(ఆర్‌ఎఫ్‌పీ) దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.

4 నుంచి 8 వరుసల గ్రీన్ ఫీల్డ్ రహదారులు

అనకాపల్లి, పెందుర్తి, ఆనందపురంలను అనుసంధానిస్తూ భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి 4/6/8 వరుసల గ్రీన్ ఫీల్డ్ యాక్సెస్ సెమీ రింగ్ రోడ్‌ను వాల్యూ క్యాప్చర్ ఫైనాన్స్ ఆధారంగా నిర్మించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి సర్వేతో పాటు అనువైన ప్రాంతాలను కలుపుతూ రహదారిని అభివృద్ధి చేయాల్సి ఉంటుంది. ఇందుకు అవసరమయ్యే భూ సేకరణ, సర్వే, సాంకేతిక, ఆర్థిక, ఇతర అన్ని అంశాలతో సమగ్ర ప్రాజెక్టు నివేదికను తయారు చేసేందుకు చర్యలు చేపట్టారు. ఈ ప్రక్రియను చేపట్టేందుకు కన్సల్టెంట్ నియమించుకోవాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన ప్రక్రియను ప్రారంభించింది.

విమానాశ్రయం కనెక్టివిటీకి..

విశాఖ చుట్టు పక్క ప్రాంతాల పట్టణీకరణతో పాటు అచ్యుతాపురం నుంచి భోగాపురం బీచ్‌కు, రాంబిల్లి, సమీప ప్రాంతాల మధ్య రద్దీ నియంత్రణకు ఈ ప్రాజెక్టు దోహదపడుతుందని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే అభివృద్ధి చేసిన ఆరు వరుసల జాతీయ రహదారికి ఈ కొత్త రహదారులు అనుసంధానించడం ద్వారా అక్కడి నుంచి తీర ప్రాంతాల మధ్య వేగవంతమైన ప్రయాణానికి మార్గం సుగమమవుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇది పర్యాటకాభివృద్ధికి తోడ్పాటు అందించడంతో పాటు ఆర్థికాభివృద్ధికి అవకాశం కలుగుతుందన్న విశ్వాసంతో ఉన్నారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ఈ రహదారులను అభివృద్ధి చేస్తున్నట్లు వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ ప్రణవ్‌గోపాల్, మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ పేర్కొన్నారు.

గురువుల్లో గుబులు



కూటమి ప్రభుత్వం విద్యారంగంపై చేస్తున్న ప్రయోగాలు గురువుల్లో గుబులు రేపుతున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా జీవో నెం.117 పేరిట పాఠశాలల విలీన ప్రక్రియ చేపట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ జీవోను రద్దు చేస్తూ పాఠశాలల పునర్నిర్మాణ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. మంగళవారం జారీ చేసిన ఉత్తర్వుల ఆధారంగా ఉమ్మడి విశాఖ జిల్లాలో ఏడు రకాల స్కూళ్లను ఏర్పాటు చేయనుంది. దీంతో ప్రాథమిక విద్యకు తీవ్ర విఘాతం కలిగే ప్రమాదం ఉందని ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- పాఠశాలల పునర్నిర్మాణంతో పోస్టులు కుదింపు
- ఉమ్మడి జిల్లాలో 538 పోస్టుల సర్దుబాటు
- 277 ఎస్‌ఏ పోస్టులు మోడల్ స్కూల్ హెచ్‌ఎంలుగా మార్పు
- ఆ మేరకు ఎస్జీటీ పోస్టులకు మంగళం

విశాఖ విద్య: కూటమి ప్రభుత్వం పాఠశాలల పునర్నిర్మాణ ప్రక్రియను కొలిక్కి తెచ్చింది. దీనిలో భాగంగా తొమ్మిది రకాల బడుల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వగా, ఉమ్మడి విశాఖ జిల్లాలోని ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా ఏడు రకాల బడులను అమల్లోకి తీసుకొచ్చారు. పంచాయతీకి ఒకటి చొప్పున విద్యార్థుల సంఖ్యను పరిగణలోకి తీసుకుని ఉమ్మడి జిల్లాలో 565 మోడల్ స్కూళ్లను ప్రతిపాదించారు. గత కొన్ని రోజులుగా చేసిన కసరత్తు మేరకు మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, కూటమి ప్రభుత్వం చేపట్టిన తాజా చర్యలతో మిగులు పోస్టులు పెరిగి, ప్రాథమిక విద్యకు నష్టం తప్పదని ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతున్నాయి.

89 యూపీ స్కూళ్ల కొనసాగింపు

కూటమి ప్రభుత్వం ప్రాథమికోన్నత(యూపీ) పాఠశాలలను పూర్తిగా రద్దు చేయాలని భావించింది. కానీ, ఆయా ప్రాంతాల ప్రజానీకం, తల్లిదండ్రుల నుంచి వచ్చిన తీవ్ర వ్యతిరేకతతో అధికారులు వెనక్కి తగ్గారు. ఇదే విషయాన్ని జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదించారు. దీంతో ఆయా ప్రాంతాల్లో దూరాభారాన్ని దృష్టిలో పెట్టుకుని 89 యూపీ స్కూళ్లను యథావిధిగా కొనసాగిస్తున్నట్లు ప్రభుత్వం తాజాగా జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. విద్యార్థులు ఎక్కువగా ఉన్న 33 యూపీ స్కూళ్లను హైస్కూళ్లుగా మార్పు చేశారు. విశాఖ జిల్లాలో 5, అనకాపల్లి జిల్లాలో–19, అల్లూరి జిల్లాలో–9 యూపీ స్కూళ్లు హైస్కూళ్లుగా మారాయి.

538 పోస్టులు సర్దు'పోటు'

స్కూళ్ల పునర్నిర్మాణంతో ఉమ్మడి విశాఖ జిల్లాలో 538 ఉపాధ్యాయ పోస్టులను సర్దుబాటు చేశారు. ఆయా మేనేజ్‌మెంట్ల పరిధిలోని పాఠశాలల్లో మిగులు కేటగిరీలో ఉన్న 230 మందిని అవసరమైన చోట సర్దుబాటు చేశారు. మరో 31 పోస్టులను ఇతర కేటగిరీల్లోకి మార్చారు. హైస్కూళ్లలో పనిచేస్తున్న 277 మంది స్కూల్ అసిస్టెంట్లను మోడల్ ప్రైమరీ స్కూళ్లలో ప్రధానోపాధ్యాయులుగా సర్దుబాటు చేశారు. దీంతో భవిష్యత్‌లో సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టుల భర్తీ తగ్గిపోనుందని ఉపాధ్యాయ వర్గాలు చెప్తున్నాయి.

ఏడు రకాల బడులు ఇలా..

స్కూల్ కేటగిరీ	విశాఖ	అనకాపల్లి	అల్లూరి	మొత్తం
ఫౌండేషన్ స్కూళ్లు	41	151	36	228
బేసిక్ ప్రైమరీ(బీపీఎస్)	231	763	925	1,919
మోడల్ ప్రైమరీ(ఎంపీఎస్)	178	188	199	565
అప్‌గ్రేడ్ హైస్కూళ్లు	5	19	9	33
హైస్కూళ్లు	76	145	16	237
హైస్కూల్ ప్లస్ జీపీఎస్	10	75	2	87
యూపీ స్కూళ్లు	21	55	13	89

చెప్పేదొకటి.. చేసేదొకటి



గ్రామీణ విద్యార్థులకు విద్యను దూరం చేసేలా ప్రభుత్వం వ్యవహరిస్తోంది. జీవో 117 రద్దు పేరిట కొత్తగా ఏర్పాటుచేస్తున్న స్కూళ్లతో ప్రాథమిక విద్య నిర్వీర్యమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. భవిష్యత్‌లో ప్రాథమిక పాఠశాలలు మూసివేయాల్సిందే. ప్రభుత్వం చెప్పేది ఒకటి.. చేసేది మరోలా ఉంది. ఇదంతా ప్రైవేటు, కార్పొరేట్ సంస్థల కోసమే అన్నట్లుగా తల్లిదండ్రుల్లో భావన ఉంది.

–టీఆర్ అంబేడ్కర్, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి

నమ్మకం పోగొట్టొద్దు



పాఠశాలలు మూతపడతాయనే భయంతో 117 జీవో ను ఉపాధ్యాయ సంఘాల పక్షాన వ్యతిరేకించాం. కానీ, పునర్నిర్మాణం పేరిట ఇప్పుడు తీసుకొచ్చిన జీవోతో ప్రభుత్వ బడులకు తీవ్ర నష్టం కలిగేలా ఉంది. పాత విధానమే మేలన్నట్లు ఉపాధ్యాయులు ఆలోచనలో పడుతున్నారు.

– ఇమంది పైడిరాజు, ఎస్టీయూ జిల్లా కార్యదర్శి



మాక్ డ్రిల్‌లో ఆయా బృందాలు

విపత్తు వేళ ఎలా స్పందించాలంటే..

జాలరిపేటలో సివిల్ మాక్ డ్రిల్



ఎంవీపీకాలనీ: విపత్తుల వేళ వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయ పనితీరును ట్రాఫిక్, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, వైద్య, రెవెన్యూ, అగ్నిమాపక సిబ్బంది ప్రదర్శించారు. జాలరిపేటలో జరిగిన మాక్ డ్రిల్‌లో ప్రకృతి వైపరీత్యాలు, యుద్ధం, ఉగ్రదాడుల వంటి ఘటనల్లో ప్రజలు, యంత్రాంగం ఎలా స్పందించాలో చూపించారు. పొగ బాంబులు పేలినప్పుడు మంటలార్పడం, క్షతగాత్రులను తరలించడం, పోలీసుల సూచనలు పాటించడం, విద్యుత్ నిలిపివేయడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు.

జయహో భారత్



తాటిచెట్లపాలెం : పెహల్గాం ఉగ్రదాడికి ప్రతిస్పందనగా భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'కు మద్దతు తెలుపుతూ, దేశవ్యాప్తంగా పలు రైల్వే స్టేషన్లు, ప్రభుత్వ భవనాలు త్రివర్ణ కాంతులతో వెలిగిపోతున్నాయి. ఇందులో భాగంగా వాల్తేర్ డివిజన్ పరిధిలోని ముఖ్యమైన స్టేషన్లలో, డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయంపై కూడా జాతీయ జెండా రంగుల్లో విద్యుద్దీపాలతో అలంకరించారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, చిత్రంలో జెడ్పీ సీఈవో నారాయణమూర్తి

మహారాణిపేట: ఉమ్మడి విశాఖ జిల్లాలో తాగునీటి ఎద్దడి నివారణకు రూ. 31 కోట్లు కేటాయించామని, ఉపాధి హామీ పథకం కింద ప్రతి గ్రామ పంచాయతీలో మూడు ఇంకుడు గుంతల తవ్వకాలు చేపట్టనున్నామని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర మంగళవారం తెలిపారు. జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, మురుగునీటి సమస్య పరిష్కారానికి ఈ చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఒక్కో ఇంకుడు గుంతకు రూ. 74 వేల వరకు ఖర్చు అవుతుందని ఆమె వివరించారు. సమావేశంలో సామాజిక పింఛన్లు, గ్రామీణాభివృద్ధి పనులపై చర్చించారు. ఏజెన్సీ ప్రాంతంలో దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టాలని, 108 అంబులెన్సులు అందుబాటులో ఉంచాలని సభ్యులు కోరారు. దీనిపై చైర్‌పర్సన్ తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యేలు రేగం మత్స్యలింగం, బండారు సత్యనారాయణమూర్తి, జెడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

థియేటర్లలో నవ్వులే నవ్వులు

- సింగిల్.. అలరించే కామెడీ ఎంటర్‌టైనర్
- విశాఖలో సందడి చేసిన చిత్ర యూనిట్



సింగిల్ చిత్ర యూనిట్

డాబాగార్డెన్స్ : యంగ్ హీరో శ్రీవిష్ణు నటించిన తాజా చిత్రం సింగిల్. ఈ నెల 9న విడుదలై మంచి స్పందన అందుకుంటోంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ మంగళవారం విశాఖపట్నంలోని ఓ హోటల్‌లో ప్రెస్ మీట్ నిర్వహించింది. హీరో శ్రీవిష్ణు మాట్లాడుతూ సింగిల్ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను ముఖ్యంగా కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకుంటుందన్నారు. చిత్రంలోని సన్నివేశాలు ప్రతి ఒక్కరినీ నవ్విస్తున్నాయని చెప్పారు. దర్శకుడు కార్తీక్ రాజు చిత్రాన్ని అద్భుతంగా రూపొందించారని, నిర్మాతలు విద్యా కొప్పినీడి, భాను ప్రతాప్, రియాజ్ చౌదరి సహకారం అందించారన్నారు. కథ సాధారణంగా ఉన్నప్పటికీ, ఆసక్తికరమైన స్క్రీన్ ప్లే, అద్భుతమైన సంభాషణలతో సినిమా ప్రేక్షకులను కట్టిపడేస్తోందని ఆయన పేర్కొన్నారు. చిత్రంలో నటించిన కేతిక శర్మ, ఇవానా, రాజేంద్రప్రసాద్, వెన్నెల కిషోర్, విటివి గణేష్, ప్రభాస్ శ్రీను, సత్య, కల్పలత తమ పాత్రలకు ప్రాణం పోశారని శ్రీవిష్ణు అన్నారు.

శ్రీవిష్ణు కామెడీ టైమింగ్ సూపర్

నటుడు వెన్నెల కిషోర్ మాట్లాడుతూ, సినిమాలో ప్రధాన పాత్ర పోషించిన శ్రీవిష్ణు తన నటనతో సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడన్నారు. కామెడీ సన్నివేశాల్లో శ్రీవిష్ణు అద్భుతంగా నటించాడని తెలిపారు. సినిమాలో అనేక ఆసక్తికరమైన పాత్రలు, మలుపులు పెట్టి దర్శకుడు కార్తీక్‌రాజు ప్రేక్షకులను నవ్వించారని, ముఖ్యంగా సెకండాఫ్‌లోని ప్రేమ సన్నివేశాలు చాలా సరదాగా ఉంటాయని ఆయన తెలిపారు.

విశాఖ అంటే చాలా ఇష్టం

హీరోయిన్లు కేతిక శర్మ, ఇవానా మాట్లాడుతూ విశాఖ అంటే తమకు చాలా ఇష్టమని, ఈ సినిమాలో నటించడం తమకు ఎంతో ఆనందంగా ఉందని చెప్పారు. శ్రీవిష్ణు, వెన్నెల కిషోర్‌తో కలిసి నటించిన సన్నివేశాలు చాలా వినోదాత్మకంగా ఉన్నాయని వారు తెలిపారు. విటివి గణేష్, ప్రభాస్ శ్రీను, సత్య తమ కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకులను కడుపుబ్బ నవ్వించారని వారు కొనియాడారు.

ఆహా.. ఆవకాయ



ఏయూక్యాంపస్: వేడివేడి అన్నం ..ఆ తర్వాత స్వచ్ఛమైన నెయ్యి ..అందులో కాస్త ఆవకాయ ముక్కను కలుపుకొని తింటే... ఆహా! ఆ రుచిని వర్ణించలేం. మొదటి ముద్దతోనే నోరంతా పులకరించిపోతుంది. వేడి అన్నం, కమ్మటి నెయ్యి, ఘాటైన ఆవకాయ... ఈ మూడు రుచులు ఒకదానితో ఒకటి పోటీపడుతూ, నాలుకపై ఒక మాయాజాలాన్ని సృష్టిస్తాయి. ఒక్కో ముద్ద తింటుంటే కడుపు నిండిపోతున్నా, ఆ రుచి మాత్రం వదలాలనిపించదు. కళ్లల్లో ఒక విధమైన మెరుపు, పెదాలపై చిరునవ్వు అదే వస్తుంది. వేసవికాలం వచ్చిందంటే ఆవకాయ సీజన్ ఆరంభం అవుతుంది. మహిళలు ఏడాది అంతా తినడానికి సరిపోయే విధంగా ఆవకాయ పెడతారు. ఆవకాయ పెట్టడానికి ఎంతో అనుభవం, నైపుణ్యం అవసరం. ఇటువంటి ఆవకాయ తయారీపై నగరంలో పోటీలు నిర్వహించారు. బీచ్ రోడ్డులోని ఓ హోటల్‌లో రెడ్ ఎఫ్ఎం, త్రీ మేంగోస్ స్పైసెస్ సంస్థ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో వందమందికిపైగా మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆవపొడి, కారం, ఉప్పు, నూనె సమపాళ్లలో కలిపి నోరూరించే ఆవకాయను క్షణాలలో సిద్ధం చేశారు. యువతుల నుంచి వృద్ధుల వరకు ఉత్సాహంగా పాల్గొని, ఆవకాయ ఘాటును రుచిచూపించారు. ఆవకాయ తయారు చేసిన మహిళలకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో ఆర్‌జేలు ప్రదీప్, కృష్ణ, షర్మిల, భావన, మధు కార్తీక్‌లతో పాటు ప్రోగ్రామింగ్ హెడ్ సుష్మ తదితరులు పాల్గొన్నారు.

భారీగా గంజాయి స్వాధీనం

నలుగురి అరెస్టు



స్వాధీనం చేసుకున్న గంజాయితో డీసీపీ-1 అజిత్ వేజెండ్ల, పోలీసులు

అల్లిపురం: గంజాయి అక్రమంగా తరలిస్తున్న నలుగురు వ్యక్తులను ఆనందపురం పోలీసులు మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి 200 కేజీల గంజాయి, ఒక బొలేరో వాహనం, ఒక ద్విచక్ర వాహనం, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ-1 అజిత వేజెండ్ల తెలిపారు. నగర పోలీస్ కమిషనరేట్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. గంజాయి రవాణా జరుగుతోందన్న సమాచారం మేరకు ఆనందపురం పోలీసులు, సిటీ టాస్క్‌ఫోర్స్ పోలీసులు కలిసి బోయపాలెం, పైడా కాలేజీ వద్ద వాహనాలు తనిఖీ చేశారు. ఈ విషయాన్ని పసిగట్టిన గంజాయి స్మగ్లర్లు బొలేరో వాహనాన్ని వెనక్కు తిప్పేందుకు ప్రయత్నించారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు వీరిని అదుపులోకి తీసుకుని వాహనాన్ని తనిఖీ చేయగా 4 బస్తాల్లో 40 బ్రౌన్ కలర్ ప్యాకెట్లలో 200 కేజీల గంజాయి లభ్యమైంది.

ఎక్కువ డబ్బు సంపాదించాలని..

తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో వీరంతా గంజాయి స్మగ్లింగ్‌కు పాల్పడినట్టు ప్రాథమిక విచారణలో తేలిందని డీసీపీ-1 అజిత వేజెండ్ల తెలిపారు. ఒడిశాలోని కోరాపుట్ జిల్లా పాడువ పంచాయతీ జమ్ముగూడ గ్రామం నుంచి గంజాయి సేకరించి విశాఖలో విక్రయించడానికి ప్రయత్నిస్తున్న రఘు హంతల్, నరేంద్ర పాంగీ, బినాయ్ మండల్ , రబీంద్ర కిలాను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

షిప్‌యార్డ్ పురోగతిపై ప్రశంసలు



మాట్లాడుతున్న మినిస్ట్రీ ఆఫ్ పోర్ట్స్ షిప్పింగ్ అండ్ వాటర్‌వేస్ కార్యదర్శి రామచంద్రన్

సింధియా : హిందుస్థాన్ షిప్‌యార్డ్ చేపట్టిన 'గ్రీన్ అండ్ గ్రోత్ ఫోకస్డ్ ఇనిషియేటివ్స్'ను కేంద్ర పోర్టులు, షిప్పింగ్, జలమార్గాలు మంత్రిత్వ శాఖ కార్యదర్శి టీకే రామచంద్రన్ అభినందించారు. షిప్‌యార్డ్ అభివృద్ధిని ఆయన సమీక్షించారు. కొత్త ఆవిష్కరణలు, దేశాభివృద్ధికి సంస్థ చేస్తున్న కృషిని మెచ్చుకున్నారు. షిప్‌యార్డ్ 84 ఏళ్ల చరిత్రను, వాణిజ్య నౌకల నిర్మాణంలో సంస్థ సహకారాన్ని చైర్మన్ హేమంత్ ఖత్రి కార్యదర్శికి వివరించారు. గ్రీన్ టగ్‌లు, హైడ్రోజన్ నౌకల అభివృద్ధి ప్రణాళికలు తెలిపారు. గ్రీన్ టెక్నాలజీకి మద్దతుగా బ్యాటరీ టగ్‌ల వ్యయం అంచనా వేయాలని రామచంద్రన్ సూచించారు. పెట్రోలియం శాఖ అవసరమైన నౌకల నిర్మాణానికి షిప్‌యార్డ్ సిద్ధంగా ఉందని ఖత్రి పేర్కొన్నారు. కొత్త డ్రై డాక్‌లు, స్లిప్‌వేలతో షిప్‌యార్డ్ సామర్థ్యం పెరుగుతుందని ఆయన అన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్



భాస్కర్

అక్కిరెడ్డిపాలెం : వివాహేతర సంబంధం పెట్టుకున్న మహిళను హత్య చేసి ఏడేళ్లుగా పరారీలో ఉన్న నిందితుడిని గాజువాక పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, గాజువాక గణపతినగర్‌లో నివాసం ఉంటున్న కె. భాస్కర్ (35)కు అదే ప్రాంతానికి చెందిన సత్తెమ్మతో 2015 నుంచి వివాహేతర సంబంధం కొనసాగించాడు. మనస్పర్థలు కారణంగా భాస్కర్ 2017లో సత్తెమ్మను హత్య చేసి మహబూబ్‌నగర్ జిల్లాలోని నాగర్‌కర్నూల్‌కు పారిపోయాడు. నిందితుడి కోసం అప్పటి సీపీ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఎట్టకేలకు మంగళవారం నిందితుడిని కల్వకుర్తిలో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఎన్‌డీపీఎస్ కేసులో నిందితుడి అరెస్టు

డాబాగార్డెన్స్: నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు, జోన్-1 డీసీపీ అజిత వేజెండ్ల సూచనలతో లాంగ్ పెండింగ్ ఎన్‌బీడబ్ల్యూ అరెస్టు వారెంటు ఉన్న వ్యక్తి పరారీలో ఉండగా .. నిందితుడు కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ బృందం 2018 నాటి ఎన్‌డీపీఎస్ (నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ యాక్ట్) కేసులో నిందితుడైన బండారి అజయ్‌ను హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకుని మంగళవారం టూటౌన్ పోలీసులకు అప్పగించారు. టూటౌన్ సీఐ వీవీసీఎం ఎర్రంనాయుడు నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. ఈ సందర్భంగా ఎన్‌బీడబ్ల్యూ ప్రత్యేక బృందాన్ని నగర పోలీస్ కమిషనర్, డీసీపీ-1, ఈస్ట్ ఏసీపీ అభినందించారు.